నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
---------------
ప్రేమ ముసుగులోన కామపిచ్చిగ యువత
కానిపనులుజేయ హానికలుగు
స్వీయరక్షణమ్ము శ్రేయస్సు నిచ్చును
విన్నవారు భువిన వెలుగు చుండ్రు
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 196 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 25-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## పాక్-అఫ్ఘాన్ బార్డర్ క్లోజ్..

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు..
- కిలో టమాటా 700 పాకిస్థానీ రూపాయలు

న్యూఢిల్లీ,
పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ రెండు దేశాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఘర్షణల నేపథ్యంలో అక్టోబర్ 11 నుంచి ఇరుదేశాల సరిహద్దులను మూసివేసిన విషయం తెలిసిందే. దీంతో రవాణా ఆగిపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.రెండు దేశాల్లో పండ్లు, కూరగాయలు, ఖనిజాలు, ఔషధాలు, గోధుమలు, బియ్యం, చక్కెర, మీట్, పాల ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగాయి. ఘర్షణల తర్వాత పాకిస్థాన్‌లో టమాటా ధరలు దాదాపు ఐదు రెట్లు పెరిగాయి. ప్రస్తుతం కిలో టమాటా ధర 700 పాకిస్థానీ రూపాయలు ఉన్నట్లు స్థానిక మీడియా తెలిపింది. అఫ్గాన్ నుంచి అధికంగా దిగుమతి చేసుకునే ఆపిల్ ధరలు కూడా భారీగా పెరిగినట్లు సమాచారం.పాక్- అఫ్గాన్ మధ్య ఏటా 2.3 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని.. ఘర్షణల నేపథ్యంలో సరిహద్దుల్లో రవాణా, వాణిజ్యం ఆగిపోయిందని కాబూల్‌లోని పాక్-అఫ్గాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధిపతి ఖాన్ జాన్ అలోకోజాయ్ తెలిపారు. అఫ్గాన్ నుంచి పాక్‌కు సరఫరా చేసే దాదాపు 5 కంటైనర్ల కురగాయలు పాడైనట్లు చెప్పారు. సరిహద్దుకు ఇరువైపులా దాదాపు 5వేల కంటైనర్లు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు.

-మిగతా 2 లో



జూబ్లీహిల్స్

# బరిలో 58 మంది అభ్యర్థులు

## తుది జాబితా ప్రకటించిన ఎన్నికల అధికారి

- 23 మంది నామినేషన్లను ఉపసంహరణ
- నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు
- రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటన



హైదరాబాద్,అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు,

-మిగతా 2 లో



## ఘోర బస్సు అగ్నిప్రమాదం పై కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలి
- ఇలాంటి దురదృష్టకర ఘటన జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం

హైదరాబాద్: అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కర్నూలు సమీపంలో జరిగిన ఘోర బస్సు అగ్నిప్రమాదం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అగ్నికి ఆహుతై 20 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. ఇలాంటి దురదృష్టకర ఘటన జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన

-మిగతా 2 లో



# కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

- బతికిబయటపడ్డ 22మంది
- మంటల్లో కాలి బూడిదయిన బస్సు
- బైకును ఢీకొని తగులబడ్డ బస్సు
- ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
- పలువురికి గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స

## ప్రమాదంలో 19 నిండు ప్రాణాలు బుగ్గి

కర్నూలు, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
యాటకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది. శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2-3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు

-మిగతా 2 లో





## సీఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

- పెళ్లికి ఆహ్వానిస్తూ పత్రిక అందచేత

హైదరాబాద్,అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ బ్యాచిలర్ లైఫ్ కు గుడ్ బై చెప్పనున్నారు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. నటి శిరీష లేళ్లతో వివాహ బంధంలో అడుగుపెట్టనున్నారు. నారా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.

-మిగతా 2 లో

## మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు.

- రంగారెడ్డి డివిజన్‌లో అత్యధికంగా 29,420 దరఖాస్తులు
- అదిలాబాద్ డివిజన్‌లో అత్యల్పంగా 4154 దరఖాస్తులు
- 27న ఉదయం 11 గంటలకు కలెక్టర్ల సమక్షంలో మద్యం షాపులకు డ్రా

హైదరాబాద్ అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణలోని 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. గురువారం ఒక్కరోజే 4822 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బీసీ బంద్, పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్టు బస్సులు నడువక పోవడం, కొన్ని చోట్ల బ్యాంకులు పని చేయక పోవడం లాంటి



ఘటనలను దృష్టి ఉంచుకొని ఎక్సైజ్ శాఖ మద్యం షాపులకు దరఖాస్తుల గడవు ఈ నెల 23 వరకు పొడగించిన విషయం తెలిసిందే.క రంగారెడ్డి డివిజన్‌లో అత్యధికంగా

-మిగతా 2 లో

## ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది

- ఐక్యరాజ్య సమితి పనితీరు అందుకు తగ్గట్లుగా లేదు
- భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్



2 లో



## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

- నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ధి చెప్పాలి
- బాకీ కార్డు విడుదల సందర్భంగా హరీష్ విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
:సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడుతారని అంటే ఘాటుగా హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి.

-మిగతా 2 లో

# కలిసి ఉంటేనే హక్కుల సాధన

- ఎస్సిడిడి స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ...
- మహిళా ఉద్యోగునిల హక్కులను కాల రాస్తే ఊరుకునేది లేదు - ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ కె.లత...
- హెచ్ డబ్ల్యు ఓల జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.పద్మ..
- గ్రూప్ 2 అధికారి శ్యాంసుందర్ రెడ్డికి ఘనంగా అభినందన..





సూర్యాపేట, అక్టోబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):
సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లోని అసోసియేషన్లు అన్ని ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సంఘాలన్నీ వెంటనే ఉద్యమ బాట పట్టాలనీ ఆయన పిలుపునిచ్చారు. గ్రూప్ 2 అధికారిగా ఎంపికైన ఎస్ సి డి డి ఉద్యోగి శ్యాంసుందర్ రెడ్డి అభినందన కార్యక్రమం కుడ కుడ లో జరిగింది. ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కే.లత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప్పు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఎస్ డబ్ల్యూ ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మందడి శ్యాంసుందర్ రెడ్డి గ్రూప్ 2 అధికారిగా నియమితులవటం అభినందనీయమని అన్నారు. ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ కే.లత, మాట్లాడుతూ మహిళా ఉద్యోగునిల హక్కులను కాల రాస్తే ఊరుకునేది లేదని అన్నారు.హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.పద్మ మాట్లాడుతూ గ్రూప్ 2 అధికారిగా నియమితులైన శ్యాంసుందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఆయన అభినందన కార్యక్రమానికి అన్ని సంఘాలను ఆహ్వానించి ఏకతాటి మీదికి తీసుకొచ్చిన సూర్యాపేట జిల్లా కార్యాలయ సూపరెంటెండెంట్ మరియు ఎఎస్ డబ్ల్యూఓ శ్రీమతి కే.లత తీసుకున్న చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణపురం రవివర్మ, సీనియర్ హెచ్ డబ్ల్యు ఓ లు ఇందిర, ఉప్పలయ్య, నాగేందర్, విమల,

-మిగతా 2 లో

# పాక్-అఫ్ఘాన్ బార్డర్ క్లోజ్..

మొదటి తరువాయి

దీనివల్ల రోజుకు ఇరువైపులా దాదాపు 1 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8 కోట్లు) నష్టం వాటిల్లుతుందన్నారు.

## ఘోర బస్సు అగ్నిప్రమాదం పై
# కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

మొదటి తరువాయి





వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు కూడా ఈ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 20 మందికి పైగా ప్రయాణికులు మరణించడం దిగ్భ్రాంతికరమని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు హరీశ్ రావు సానుభూతి ప్రకటించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సంఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన కవిత, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు.

# సీఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

మొదటి తరువాయి

పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న నారా రోహిత్.. శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన వివాహానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నారా రోహిత్ – శిరీషల వివాహం ఈ నెల అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహ వేడుకలను ఏకంగా నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నారా కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 25న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. అక్టోబర్ 26న సంప్రదాయబద్ధంగా పెళ్లికొడుకు కార్యక్రమం జరగనుంది. అక్టోబర్ 28న మెహందీ వేడుక, 29న సంగీత్ నైట్ నిర్వహించనున్నారు. చివరగా, అక్టోబర్ 30న రాత్రి 10:35 గంటలకు శుభ ముహూర్తాన రోహిత్, శిరీష ఒక్కటవ్వనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు – భువనేశ్వరి దంపతులు పెద్దలుగా ఈ వివాహ వేడుకలో పాల్గొననున్నారు. రోహిత్, శిరీషల పరిచయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వారిద్దరూ కలిసి నటించిన 'ప్రతినిధి?2' సినిమా షూటింగ్ సమయంలోనే స్నేహం ఏర్పడింది. అది క్రమంగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, నిశ్చితార్థం జరిగిన కొద్ది కాలానికే రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూయడంతో పెళ్లిని వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి తేదీ ఖరారు చేశారు. సినీ పరిశ్రమలో ఈ వివాహం'ఈ ఏడాది అత్యంత ఆకర్షణీయమైన స్టార్ వెడ్డింగ్'గా నిలవనుంది.

# కలిసి ఉంటేనే హక్కుల సాధన

మొదటి తరువాయి






శ్వేత, కమలాకర్, ముత్యాలరావు, మెహబూబా, భాస్కర్, కార్యాలయ సిబ్బంది రాధ, యాదగిరి, యాదయ్య, ఉస్మాన్ తదితరులు హాజరయ్యారు. అనంతరం గ్రూప్ 2 అధికారిగా నియమితులైన శ్యాంసుందర్ రెడ్డినీ ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా గెలుపొంది మొదటిసారి సూర్యాపేటకు వచ్చిన ఉప్పు సత్యనారాయణ ను, ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి లత ను, సూర్యాపేట జిల్లా హెచ్ డబ్ల్యు ఓ ల అధ్యక్షురాలు గా ఎన్నికైన సిహెచ్. పద్మను మినిస్టీరియల్ సిబ్బంది సంఘం మరియు హెచ్ డబ్ల్యు ఓ ల అసోసియేషన్ లు ఘనంగా సత్కరించాయి.

# జూబ్లీహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

మొదటి తరువాయి

పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు




ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.3

# సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

మొదటి తరువాయి

ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ, రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 5 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు.వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

మొదటి తరువాయి

కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. భయానకమైన ఘటనా స్థలి దృశ్యాలు ప్రమాద స్థాయిని కళ్లకు కడుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నుంచి రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర,రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం బయటపడ్డారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు బస్సు ప్రమాదంలో గాయాలైన వారిని ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమారెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగారు. పోలీసులకు ఆమె సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు.

మొదటి తరువాయి

29,420 దరఖాస్తులు రాగా, అదిలాబాద్ డివిజన్‌లో అత్యల్పంగా 4154 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాలకు ఈ నెల 27వ తేదీన డ్రా నిర్వహించనున్నారు. 27న ఉదయం 11 గంటలకు కలెక్టర్ల సమక్షంలో మద్యం షాపులకు డ్రా తీయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పరిధిలో 771, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 680, మంచిర్యాలలో 1712, నిర్మల్‌లో 991, హైదరాబాద్‌లో 3201, సికింద్రాబాద్‌లో 3022, జగిత్యాలలో 1966, కరీంనగర్‌లో 2730, పెద్దపల్లిలో 1507, రాజన్న సిరిసిల్లలో 1381, ఖమ్మంలో 4430, కొత్తగూడెంలో 3922, జోగులాంబ గద్వాలలో 774, మహబూబ్‌నగర్‌లో 2487, నాగర్‌కర్నూల్‌లో 1518, వనపర్తిలో 757, మెదక్‌లో 1420, సంగారెడ్డిలో 4432, సిద్దిపేట్‌లో 2782, నల్లగొండలో 4906, సూర్యాపేట్‌లో 2771, యాదాద్రి భువనగిరిలో 2776, కామారెడ్డిలో 1502, నిజామాబాద్‌లో 2786, మల్కాజిగిరిలో 5168, మేడ్చల్‌లో 6063, సరూర్‌నగర్‌లో 7845, శంషాబాద్‌లో 8536, వికారాబాద్‌లో 1808, జనగామలో 1697, జయంశంకర్ భూపాలపల్లిలో 1863, మహబూబబాద్‌లో 1800, వరంగల్ రూరల్‌లో 1958, వరంగల్ అర్బన్‌లో 3175 మొత్తంగా 95,137 దరఖాస్తులు వచ్చాయి.

## ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది

**ఐక్యరాజ్య సమితి పనితీరు అందుకు తగ్గట్లుగా లేదు**
**భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్**

న్యూఢిల్లీ,
ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు.

### 2025 అక్టోబర్ 25, శనివారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
కార్తీక మాసం
శుక్ల పక్షం
తిథి
పంచమి: అక్టోబర్ 24 రాత్రి 9:41 అక్టోబర్ 25 రాత్రి 9:43 వరకు
షష్టి: అక్టోబర్ 25 రాత్రి 9:43 అక్టోబర్ 26 రాత్రి 10:03 వరకు
నక్షత్రం
మూల: అక్టోబర్ 24 రాత్రి 8:41 అక్టోబర్ 25 రాత్రి 8:24 వరకు
పూర్వాషాఢ: అక్టోబర్ 25 రాత్రి 8:24 అక్టోబర్ 26 రాత్రి 8:18 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:47 - 5:31
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:38 -12:22
అమృతకాలం: మధ్యాహ్నం 3:25 - 5:10
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 9:13 - 10:42
యమగండం: మధ్యాహ్నం 1:11 - 2:40
గుళికా: ఉదయం 6:17 - 7:46
దుర్ముహూర్తం: ఉదయం 6:17 - 7:05,
మధ్యాహ్నం 1:10 - 1:58
వర్జ్యం: రాత్రి 12:45 - 2:25

# పోలీస్ స్మారక వారం 2025 సందర్భంగా అమరవీరులకు కొవ్వొత్తి మార్చ్




**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీస్ స్మారక వారం 2025 సందర్భంగా మన వీర్ అమర్ జవాన్ జ్ఞాపకార్థంగా కొవ్వొత్తి మార్చ్ కార్యక్రమం శుక్రవారం కరీంనగర్ క్లాక్ టవర్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ సర్కిల్ వరకు నిర్వహించబడింది. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల హృదయాలను తాకింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ ట్రాఫిక్ పోలీస్ కరీంనగర్ శ్రీ కరీం ఉల్లా ఖమ్ జీ, అతిథిగా ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ శ్రీ పర్స రమేష్ జీ హాజరయ్యారు. వీరిని శాలువాతో, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రాఫిక్ ఎస్సై శ్రీ హనుమంత రావు జీ, అన్మోల్ ఓఝా, ఘన్శామ్ ఓఝా, శ్రీ పల్లె మధుకర్ రెడ్డి జీ (ఏ.ఓ. శ్రీ చైతన్య డిఫెన్స్ అకాడమీ, కరీంనగర్), శ్రీ ఎండీ అస్లాం జీ, ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుళ్లు, సిబ్బంది, పోలీస్ యువ శక్తి కార్యక్రమం విద్యార్థులు, పౌరులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర పోలీసు, పోలీస్ కమిషనరేట్ కరీంనగర్, ట్రాఫిక్ పోలీస్ కరీంనగర్, ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ , యాంటీ కరప్షన్ టీమ్ ఇండియా,యంగ్ ఇండియా మిషన్, సురక్షితమైన భారతీయ రోడ్లు, కరీంనగర్ సైకిల్ క్లబ్, షూట్ ఇన్ ప్రొడక్షన్స్, పోలీస్ మిత్ర బృందం కరీంనగర్ సంయుక్తంగా నిర్వహించాయి.

# అకాల వర్షాలతో నష్టపోయిన పంటలపై పరిశీలన

**ఎకరానికి రూ.30,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్**



**మిర్యాలగూడ, అక్టోబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మిర్యాలగూడ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో, మాజీ శాసనసభ్యుడు జూలకంటి రంగన్న పంట పొలాలను పరిశీలించి, ప్రతి ఎకరానికి రూ.30,000 నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల బాధలను స్వయంగా పరిశీలించిన ఆయన, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టపరిహారం ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేషన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి రవి నాయక్, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పోలేపల్లి గోవిందరెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు హనుమానాయక్, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, శాఖ కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు సాయన్న, మాజీ సర్పంచ్ సాయన్న, రూప్లా నాయక్, మరియు అనేక మంది రైతులు పాల్గొన్నారు.రైతుల ఆకాంక్షలకు ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది.

# ప్రైవేటు కాలేజీల సమ్మెకు బీసీ సంఘాల మద్దతు

## నవంబర్ 1 లోపు రూ.900 కోట్లు విడుదల చేయాలని డిమాండ్

**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైంది. గత చర్చల్లో దసరా లోపు రూ.600 కోట్లు, దీపావళి లోపు మిగతా రూ.600 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు కేవలం రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తిగా విడుదల చేయకపోవడంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు నవంబర్ 3 నుంచి నిర్విరామ సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాలు ప్రకటించాయి. ఈ సమ్మెకు బీసీ సంఘాలు పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్నాయని, వివిధ కార్యక్రమాలు



చేపడతామని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ తెలిపారు.ప్రభుత్వం విడుదల చేసిన రూ.300 కోట్లలో సగానికి పైగా నిధులు ప్రభుత్వ విద్యాసంస్థలకే వెళ్లాయి. దీంతో వెంటనే రూ.900 కోట్లు విడుదల చేసి ప్రైవేటు కాలేజీలను, విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో అనేక కాలేజీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మూతపడుతున్నాయి. విద్యార్థులు సర్టిఫికెట్ కోసం తీవ్రంగా ఇబ్బంది పడుతూ, మధ్యలోనే చదువు ఆపివేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి.నవంబర్ 1 లోపు రూ.900 కోట్లు విడుదల చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థలు, విద్యార్థులను ఆదుకోవాలని, స్కాలర్షిప్ సెక్షన్, బీసీ వెల్ఫేర్ అధికారుల దుర్వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల తరఫున ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లకు కేరాఫ్ కాంగ్రెస్

**కారానా గడ్డలో భూమి పూజ**



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, కారా?నా గడ్డలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. పేదలకు ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, గత పాలకులు ఒక్క ఇల్లు కూడా నిర్మించలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. దసరా కానుకగా 4000 ఇండ్లు, త్వరలో మరో 4000 ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి బాలరాజు, గండి శ్యాము, తాండ్ర శంకర్, కాసారపు కిరణ్, గండి గణేష్, గసికంటి కుమార్, జాగిరి సాగర్, నీర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి

**పోలీస్ కమిషనర్**




**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పిలుపునిచ్చారు. 'నషాముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మహిళలు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి తెలంగాణ చౌక్ మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు సాగిన ర్యాలీలో కమిషనర్ గౌస్ ఆలం, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు. అనంతరం కమిషనరేట్ ఆడిటోరియంలో సమావేశం జరిగింది. డ్రగ్స్ మానసిక, శారీరక నష్టం కలిగిస్తాయని, ఒత్తిళ్లను అధిగమించేందుకు పుస్తకాలు చదవడం, స్నేహితులతో మాట్లాడడం, సామాజిక సేవ వంటి మార్గాలు ఉన్నాయని సూచించారు. జిల్లాలో ప్రత్యేక బృందం డ్రగ్స్ నిర్మూలనకు పనిచేస్తోందని, సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 31 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీమ్ రావ్, డీఐఓ గంగాధర్, సిడిపిఓ సబిత, పెండ్యాల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలి



**దేవరకొండ**
**అక్టోబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఆర్ అండ్ బి తెలంగాణ రాష్ట్ర డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ కి తెలంగాణ కాంట్రాక్టర్ల రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి ఇరగ దిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్ అండ్ బి మరియు పంచాయతీ రాజ్ ట్రైబల్ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్ మున్సిపాలిటీలలో పనులు పూర్తి చేసి రెండు రెండు సంవత్సరాలు దాటింది ఇంతవరకు ఏ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు ఇట్టి బిల్లుల కోసం హైదరాబాద్ పోయి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని, పొన్నం ప్రభాకర్ ని, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, ఉత్తంకుమార్ రెడ్డి ని ,రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ ని 14 సార్లు కాంట్రాక్టర్లు అందరం వెళ్లి వినతి పత్రాలు అందజేశాము మేము చిన్న కాంట్రాక్టర్లం అప్పులు తెచ్చి పనులు పూర్తి చేసినాము దయచేసి మా యొక్క చిన్న కాంట్రాక్టర్లను ఆదుకొని మా కుటుంబాన్ని రోడ్డున పడకుండా చూడాలని వెంటనే మా బిల్లులు మంజూరు చేయాలని కోరారు. చాలాసార్లు చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమాలు కూడా చేశాం అలాగే నారాయణగూడ ప్రెస్ క్లబ్లో కూడా మాట్లాడాం ఈ ప్రభుత్వానికి మాపై కనికరం లేదు రెండు సంవత్సరాల నుండి బిల్లులు రాక ఎనిమిది మంది ఆత్మహత్య చేసుకున్నారు.ఈవిషయం ప్రభుత్వానికి తెలుసు మళ్లీ ఇప్పుడు కొత్త పనులు టెండర్లు పెడుతున్నారు ఆన్లైన్లో పాత బిల్లులు ఇవ్వకుండా కొత్త పనులు ఎలా పిలుస్తారు కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్లు వేయకూడదని అన్నారు . ముఖ్యమంత్రి ,సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు మమ్ములను దృష్టిలో ఉంచుకొని మా యొక్క బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 51 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స




**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంధత్వ నిర్మూలన లక్ష్యంగా లక్సెట్టిపేట్ పరిసర గ్రామాల్లో నిర్వహించిన ఉచిత కంటి క్యాంపులో ఎంపికైన 51 మంది బీదవారికి లయన్స్ రేకుర్తి కంటి దవాఖానలో ఉచిత క్యాటరాక్ట్ శస్త్రచికిత్స నిర్వహించారు.ఆధునిక పరికరాలు, అనుభవం ఉన్న వైద్యుల సేవలతో పాటు ఉచిత రవాణా, మందులు, అద్దాలు, భోజన సదుపాయాలు కల్పించారు. ఆసుపత్రి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ ఆధ్వర్యంలో ఈరోజు వారిని స్వగ్రామాలకు పంపించారు.

# రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
క్రీడల ద్వారా విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఉత్సాహంగా ముందుకు సాగగలరని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారురాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థి జి. సుశాంత్, 10వ తరగతి విద్యార్థి డి. మహిత్ రెడ్డి అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు, పాఠశాలలు విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శాతవాహనలో ఆర్థిక అవగాహన కార్యక్రమం




**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో "ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక అవగాహన" కార్యక్రమం ప్రిన్సిపాల్ డా. ఎస్. రమాకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె. శారద విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ లావాదేవీల జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సురక్షిత ఆర్థిక అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డా. విజయకుమార్, విభాగాధిపతులు డా. జోసెఫ్, డా. ప్రసాద్, డా. కిరణ్, డా. రవి కుమార్, డా. మల్లారెడ్డి, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా కోదాటి శ్రీనివాసరావు



**ఎలిగేడు, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ జాగృతి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ముప్పిరితోట గ్రామానికి చెందిన కోదాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ నియామకాన్ని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సాంస్కృతిక, సామాజిక అంశాలపై పనిచేస్తున్న జాగృతి సంస్థ బలోపేతంలో భాగంగా ఈ నియామకం జరిగింది. కొత్త అధ్యక్షుడు జిల్లాలో కార్యకలాపాలను విస్తరించేందుకు కృషి చేస్తారని సంస్థ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.శ్రీనివాసరావు నియామకంపై అభిమానులు, జిల్లా ప్రజలు, జాగృతి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# పెగడపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి, మరొకరు గాయపాటు



**పెగడపల్లి, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెగడపల్లి మండలంలోని నందగిరి గ్రామ శివారులో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సోమనపల్లి గ్రామానికి చెందిన చెట్ల వంశీ అక్కడికక్కడే మృతి చెందగా, ఉప్పర రంజిత్ అనే యువకుడికి కాలు విరిగిన గాయాలు అయ్యాయి. వీరిద్దరూ బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై కిరణ్ కుమార్ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం

## మాజీ మంత్రి సబితా,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**హైదరాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయం ఖాయమని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు కోరారు.ప్రచారంలో మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, భూత్ ఇన్‌చార్జులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# షాద్ నగర్‌లో పత్తి కొనుగోలు కేంద్ర ప్రారంభం

## రైతులకు మద్దతు ధర భరోసా



**షాద్ నగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని రఘూవేంద్ర కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు నాణ్యతగల పత్తిని తేమ తక్కువగా తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.నియోజకవర్గ వ్యాప్తంగా 9 మిల్లులను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించిందని, సీసీఐ మద్దతు ధర క్వింటాలుకు 8,110గా నిర్ణయించిందని తెలిపారు. స్లాట్ బుకింగ్ సమస్యలుంటే వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, సభ్యులు, రంగారెడ్డి జిల్లా అధికారులు, పత్తి మిల్లు యాజమాన్యం, రైతులు, స్థానిక నాయకులు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ

## మహిళల సమస్యలకు పరిష్కారం



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ మండలంలోని బుట్టిరాజారామ్ కాలనీ రెండవ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా సభకు హాజరై తమ సమస్యలు విన్నవించుకోవాలని, సభ ద్వారా మానసిక ఉత్తేజం కలుగుతుందని తెలిపారు. హెల్త్, అంగన్వాడీ సిబ్బంది హాజరయ్యే ఈ సభలో సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతో పాటు సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలు, షుగర్ బోర్డు ద్వారా ఆహారంలో షుగర్ ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నారు. డిఐఓ సాజిదా మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో 50 రకాల ఉచిత పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి మహిళా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో శ్రీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. సీడీపీఓ సబిత, డిఐఓ సాజిదా, ఐసిడిఎస్ రాజమణి, బీసీ సతీష్, రాజేందర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీ తనిఖీ చేసిన జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు



**గంగాధర, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా కలిసి తనిఖీ చేశారు. హాజరు, అవుట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఎన్‌సీడీ క్లినిక్‌లో బ్లూ, రెడ్ రిజిస్టర్లను పరిశీలించి అధిక రక్తపోటు, షుగర్ బాధితులకు మందుల పంపిణీ తీరును పరిశీలించారు. ఉచిత మందుల వినియోగంపై అవగాహన కల్పిస్తూ, మందుల ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు.ఫార్మసీలో సీజనల్ వ్యాధుల మందుల నిల్వలు, ఐఎల్ఆర్ టీకా నిల్వలు, ఐఈసీ బోర్డు వివరాలు, ఆరోగ్య కార్యక్రమాల టీవీ ప్రసారం తదితర అంశాలను పరిశీలించారు. మహిళల రీస్క్రీనింగ్, ప్రసూతి గది పరిశుభ్రత, అత్యవసర మందుల లభ్యత, సాధారణ డెలివరీల ప్రోత్సాహం వంటి అంశాలపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కలిసిన రవీందర్ యాదవ్



**హైదరాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శేరిలింగంపల్లి యువ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. శాలువా సమర్పించి, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ బంపర్ మెజార్టీతో విజయం సాధిస్తుందని కేసీఆర్‌కు వివరించారు. కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. విస్తృత ప్రచారం కొనసాగుతోందని, ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు.హైదరాబాద్ అభివృద్ధి ఘనత కేటీఆర్‌దేనని, మున్సిపల్ శాఖ మంత్రిగా ఫ్లై ఓవర్లు, రోడ్లు, డ్రైనేజీ, గ్రీనరీతో నగరాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పాలన నగరాన్ని ఆగం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# వన్నారం గ్రామంలో పంచాయతి భవనానికి భూమి పూజ



**మానకొండూరు, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.20 లక్షల నిధులతో వన్నారం గ్రామంలో నూతన గ్రామ పంచాయతి కార్యాలయ భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు.గ్రామ పంచాయతి స్పెషల్ ఆఫీసర్ కొమురోజు వెంకన్న, సెక్రటరీ తంబ ప్రసూన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ పోలాడి రామారావు, మాజీ సర్పంచులు బాకారపు శ్రీనివాస్, మద్దెల లచ్చయ్య, పోలాడి కవితా వంశీధర్ రావు, మాజీ ఉపసర్పంచ్ బాకారపు తిరుపతి, ఆఫీసర్ కర్ర నర్సయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, ఉద్యోగులు, పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నీల రవీందర్



**షాద్ నగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చిన్నటేకూరు వద్ద బైక్‌ను ఢీకొని మంటలు చెలరేగడంతో బస్సు దగ్ధమై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సామాజిక కార్యకర్త నీల రవీందర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పేర్కొంటూ, డ్రైవర్ల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, రహదారుల భద్రతా చర్యలను బలోపేతం చేయాలని, ఇటువంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఘనంగా జెనెసిస్ గాల 2025 ప్రెషర్స్ పార్టీ



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైఫ్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో జెనెసిస్ గాల 2025 పేరుతో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం వేడుకలు ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కళాశాల సంస్కృతి, చరిత్ర, లక్ష్య సాధన గురించి సూచనలు చేశారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఈ వేడుకను నిర్వహించారు.వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నిబిడీకృతమైన శక్తులను వెలికితీయడానికి, భవిష్యత్తు ప్రణాళికలకు దిక్సూచిగా నిలిచిందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

# బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవానిమాత

**లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్**



**కద్తాల్, అక్టోబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని మాత అని కద్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. శుక్రవారం కద్తాల్ మండలంలోని గానుగుమర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మించిన తుల్జా భవాని ఆలయంలో తుల్జామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో వేద పారాయణం, మండప పూజ, ప్రధాన హెూమాలు నిర్వహించారు. మంగళ నీరాజనాలతో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో . బోజ్య మహారాజ్ మాజీ సర్పంచులు భిక్య నాయక్, హరిచంద్ నాయక్, రాములు నాయక్, డైరెక్టర్ సేవ్య నాయక్, నాయకులు పాండు నాయక్, శంకర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, శీను నాయక్, టిక్ లాల్ నాయక్, నరేష్ నాయక్, జాన్యా నాయక్, రూప్ సింగ్ నాయక్, శీను నాయక్, అంజి, రాజు, రవి, రెడ్యా, బిచ్యా, హరియా, జగన్, చందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులు సామాజిక సేవకులే

**ఈర్ల సమ్మయ్య**



**ఎలిగేడు, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాత్రికేయ వృత్తి కత్తి మీద సాములాంటిదని, వారు సమాజంలో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య పేర్కొన్నారు.కాల్వ శ్రీరాంపూర్ మండలంలో శుక్రవారం సీనియర్ పాత్రికేయులు రావి కోటేశ్వరలింగం (శ్రీరాంపూర్), జిలుకర రమేష్ (మొట్లపల్లి) నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరంగా పరామర్శించారు. కోటేశ్వరలింగం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై బెడ్ రెస్ట్ లో ఉండగా, రమేష్ కాలికి గాయమై సర్జరీ అనంతరం ఇంటికి చేరారు. ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ, "పాత్రికేయులు రాత్రింబగళ్లు కృషి చేస్తూ సమాజానికి సేవలందిస్తున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. ఆయన వెంట ప్రముఖ కళాకారుడు పాల శంకర్ ఉన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తాం

**ఏఐఎస్ఎఫ్ డిమాండ్.**
**బిఆర్.జి.రెడ్డి జూనియర్ కళాశాల నూతన సభ్యత్వం.**



**తెలకపల్లి,అక్టోబర్ 24,(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలకపల్లి మండలం లో ని ఆర్.జి.రెడ్డి జూనియర్ కళాశాలో ఏఐఎస్ఎఫ్ నూతన సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుమల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ,కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల ప్రారంభమై 20 నెలలు గడుస్తున్న కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్లో కొట్టుమిట్టాడుతున్నాయని వర్షాకాలంలో వర్షం కురిస్తే చాలావరకు హాస్టల్ భవనాలు, పాఠశాల భవనాలు నాని కూలిపోయే ప్రమాదం ఉందని వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. 8000 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్మెంట్ , స్కాలర్షిప్ పెండింగ్లో ఉండడంవల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే వాటిని విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డిఇఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులంది ఇవ్వాలని, విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేయాలని పటిష్టమైన ఫీజు నియంత్రణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దేశమున ఆంజనేయులు,పల్లవి, శిరీష, రవి, సంతోష్, లక్ష్మి, ప్రసన్న, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

# జిల్లా కారాగారం పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జి




**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేష్ జిల్లా కారాగారాన్ని సందర్శించి ఖైదీలకు అందుతున్న సేవలను తనిఖీ చేశారు. విచారణ ఖైదీలతో మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి సేవన, విక్రయంపై కఠిన శిక్షలు ఉంటాయని, నేరాలకు అలవాటు పడకూడదని సూచించారు. కారాగారాన్ని పరివర్తన కేంద్రంగా భావించి, సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, జైలర్ శ్రీనివాస్, సబ్ జైలర్ రమేష్ నాయక్, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.

# టెట్‌పై సుప్రీంకోర్టులో టీఆర్‌టీఎఫ్ రివ్యూ పిటిషన్

**హైదరాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పునఃసమీక్షించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) తరఫున రివ్యూ పిటిషన్ దాఖలైంది. టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొంటూ, 2017లో సవరించిన ఆర్టీఈ చట్టం 23(2) కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించినట్లు తెలిపారు.

# వైభవంగా శ్రీ తుల్జా భవాని విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

**పాల్గొన్న సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్**



**కద్తాల్, అక్టోబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
రంగారెడ్డి జిల్లా కద్తాల్ మండల పరిధిలోని గనుగుమర్ల తండా గ్రామ పంచాయితి కనుగుబాయి తండాలో తుల్జా భవాని నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రతిష్టపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. విగ్రహాలకు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్ , ఆలయ ఫౌండర్ చైర్మన్ నేనావత్ బీక్యా నాయక్ , కద్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్యా నాయక్, పిఏసిఎస్ డైరెక్టర్, మాజీ ఎంపిటిసి వెంకటేష్, మాజీ సర్పంచ్ రాములు నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రారంభోత్సవం మూడవ రోజు ఘనంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంష మూత్య నాయక్, మాజీ ఉపసర్పంచ్ శారద పాండు నాయక్, కద్తాల్ కిసాన్ సెల్ అధ్యక్షులు బాల్ రాజ్ , మాజీ వార్డ్ సభ్యులు లచ్య నాయక్, నరియా నాయక్, రాజు నాయక్, రెడ్యా, లక్ష్మణ్, బిచ్చ, నరిసాంగ్, బాలు, గోపి, ఇస్లావత్ రాజు, నాయకులు, యువకులు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**కద్తాల్, అక్టోబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నాయకుడిని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. కద్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన తలాటి స్వామి ముగ్గురు చిన్నారులతో కలిసి బైక్ పై వెళుతుండగా యాచారం మండలం తమ్మలోని గూడెం వద్ద టాక్టర్ ఢీకొని అభిరామ్, హార్దిక్ రామ్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు స్వామి, ఆయన కుమారుడు సాత్విక్ రామ్ తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్వామి, సాత్విక్ లను శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాద సంఘటన పట్ల తీవ్ర విచారణ వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా తగిన సాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ .5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమనగలు పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్య ప్రకాష్ ను ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.పరామర్శించిన వారిలో టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ , కాంగ్రెస్ నాయకులు నరసింహ, సురేందర్ రెడ్డి, రామకృష్ణ, తదితరులున్నారు.

# మునగాల కొండలరావు డిగ్రీ కళాశాలలో భాషా అభివృద్ధిపై విశ్లేషణాత్మక ఉపన్యాసం



**దేవరకొండ, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), తెలుగు విభాగం ఆధ్వర్యంలో "భాష – అభివృద్ధిలో ఆర్థిక పార్శ్వం" అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. డాక్టర్ ఆంజనేయులు తోటపల్లి (సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఒడిస్సా) ముఖ్య అతిథిగా హాజరై భాషా వికాసంలో ఆర్థిక అంశాల ప్రాధాన్యతపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల విజ్ఞానాన్ని విస్తరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు జి. కోటయ్య, ఎ. శ్రీను, వి. యాదయ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కవిత సమక్షంలో జాగృతిలో చేరికలు



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాగృతిని జిల్లాలో బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో పలువురు నేతలు జాగృతిలో చేరారు. జాగృతి అధ్యక్షురాలు కవితక్క స్వయంగా కండువాలు కప్పి స్వాగతం పలికారు. చేరిన వారిలో తెలంగాణ ఉద్యమకారుడు పెండ్యాల మహేష్, మల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ బుడిద పర్వారం గౌడ్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు చంటి శ్రీనివాస్, బీఆర్ఎస్ యువజన నేతలు దెబ్బటి సూర్య, పెరుమండ్ల అభిషేక్, బ్యూటీ అసోసియేషన్ సభ్యులు కోంద్ర శోభరాణి, మౌనిక తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కవితక్క మాట్లాడుతూ, ఉద్యమకారులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని, కరీంనగర్ జాగృతిని బలోపేతం చేస్తామని, రానున్న రోజుల్లో సామాజిక ఉద్యమకారులను కాపాడుకుంటామని తెలిపారు. జాగృతి జనం బాట కార్యక్రమం ఈనెల 25 నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతుందని, 31, నవంబర్ 1న కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, మేధావులు, ఉద్యోగ నిరుద్యోగులు, వ్యాపార వర్గాలు, ఇంజనీర్లు, అడ్వకేట్లు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జాగృతి ఆరోగ్య విభాగం అధ్యక్షుడు మేకల తిరుపతి, రూప, విజయ, కొత్తురి రఘు, శ్రీరాముల రమేష్, గర్షకుర్తి విద్యాసాగర్, పలువురు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# షేక్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



**షేక్‌పేట్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షేక్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు చురుకుగా పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ప్రచారంలో డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి. సత్యనారాయణ, రమేష్, నర్సింగ్ రావు, బాలు, బాబు రావు, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మల్ రెడ్డి



**తుర్క యంజాల్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తుర్క యంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, "శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు పట్నం ప్రజలందరిపై ఉండాలి. భగవంతునికి సేవ చేయడం పూర్వ జన్మ సుకృతం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, కాకుమాను సునీల్, బొక్క వంశీధర్ రెడ్డి, వివిధ కాలనీల ప్రజలు, మహిళలు, అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ తుల్జాభవానీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

**-పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**
**- దేవాలయ అభివృద్ధికి రూ.3 లక్షలు సహాయం**



**కడ్తాల్, అక్టోబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీ తుల్జాభవానీ మాతా దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై అమ్మవారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు మనలో ఆధ్యాత్మికతను పెంపొందించి, శాంతిని అందించే గొప్ప నిలయాలు అని, ఆలయాల అభివృద్ధికి అందరం సహకారం అందించాలని, మన సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తూ, భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందని తెలుపుతూ, కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న తుల్జాభవాని మాతా దేవాలయ అభివృద్ధికి తండా వాసుల, స్థానిక నాయకుల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షలు సహకారం అందించడం జరిగిందని, మొదటి విడతగా ఆలయ నిర్మాణానికి రూ.1 లక్ష చెక్కును అందించారు. రెండో విడతగా ఆలయానికి రూ.2 లక్షలతో పెయింటింగ్ పనులు పూర్తి చేయడం జరిగిందని, ఆలయ అభివృద్ధిలో తనను భాగస్వామ్యం చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..**
మా తండా తుల్జా భవానీ మాత దేవాలయ నిర్మాణానికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి అడిగిన వెంటనే స్పందించి ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలు సహకారం అందించారని, ఇంత త్వరితగతిన పెద్ద మొత్తంలో తోడ్పాటును అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఎల్లపుడు రుణపడి ఉంటామని, వారికి భవిష్యత్ లో కూడా తోడుగా నడుస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బీక్యా నాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, ఆలయ కమిటీ సభ్యులు బిచ్యా నాయక్, నర్సింగ్, లక్ష్మణ్, నరేష్, జన్య, రాజు, దేవుల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సధ్వజ నవగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పసుల నారాయణ కిసాన్ నగర్‌లోని శ్రీ పంచముఖాంజనేయ కాశీవిశ్వేశ్వర సహిత దేవాలయంలో శుక్రవారం ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురాణం మహేశ్వర శర్మ పర్యవేక్షించారు. ప్రతిష్ఠాపన మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపు రైతులకు వరం

**ఒక్కో ట్రాక్టర్‌పై రూ.40 వేల నుంచి లక్ష వరకు ఆదా**



**చొప్పదండి, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జీఎస్టీ తగ్గింపు రైతులకు ఆర్థికంగా మేలు కలిగించిందని, ఒక్కో నూతన ట్రాక్టర్ కొనుగోలుపై ఏడు శాతం పన్ను తగ్గడంతో రూ.40,000 నుంచి లక్ష రూపాయల వరకు ధర తగ్గిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. జీఎస్టీ సంబరాల మాసోత్సవం సందర్భంగా బీజేపీ చొప్పదండి రూరల్ శాఖ అధ్యక్షుడు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ షోరూమ్ సందర్శన జరిగింది. రాగంపేట గ్రామానికి చెందిన సింగసాని కనకయ్యను శాలువాతో సత్కరించి, మిఠాయి తినిపించి, అనుభవం తెలుసుకున్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో 84 లక్షల కుటుంబాలకు సగటున రూ.10,000–30,000 వరకు జీఎస్టీ తగ్గింపు ద్వారా ఆదా కలుగుతుందని, మొత్తంగా రూ.19,000 కోట్ల ఆదా రాష్ట్ర ప్రజలకు లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, స్థానిక సంస్థల మండల కన్వీనర్ సింగిరెడ్డి భూమిరెడ్డి, మాజీ ఎంపిటిసి, జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఉపసర్పంచులు, స్థానిక నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేకే మహేందర్ రెడ్డి కుమారుడి వివాహానికి హాజరైన బీజేపీ నేతలు



**సిరిసిల్ల, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కుమారుడు విపుల్ రెడ్డి వివాహ వేడుకకు బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, సీనియర్ నాయకులు బంధారపు లక్ష్మారెడ్డి, వంతడుపుల సుధాకర్, వంగ శ్రీకాంత్, సిరిసిల్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో చరిత్ర తిరగరాస్తాం

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు బలపరుస్తున్న ప్యానెల్ అభ్యర్థులే భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన సమావేశంలో ప్యానెల్ అభ్యర్థులతో కలిసి ప్రచార వ్యూహాలు, విజయ లక్ష్యాలు చర్చించారు. ఈ సందర్భంగా జగిత్యాల నుంచి ప్రతిపాదించిన ఇద్దరు మున్నూరు కాపు యువకులు మెరికలు లాంటి వారు అని కొనియాడారు. వెలిచాల రాజేందర్ రావు విజన్ ఉన్న నాయకుడు, ఆయన ఎంపిక చేసిన అభ్యర్థులు నీతిమంతంగా పనిచేసే వారని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అర్బన్ బ్యాంక్‌ను రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దేందుకు రాజేందర్ రావు కంకణం కట్టుకున్నారని, ఖాతాదారులు ఆయన ప్యానెల్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న జరిగే ఎన్నికల్లో సభ్యులు ఓటు హక్కును వినియోగించి ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ, "అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి మా ప్యానెల్ కట్టుబడి పనిచేస్తుంది. సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం. చరిత్ర తిరగరాస్తాం," అని స్పష్టం చేశారు.

# ఆర్టీసీ ఇదేం తీరు..
# రంగు పల్లె వెలుగులు.. బోర్డు.. ఎక్స్ ప్రెస్..!

**-కల్వకుర్తి - హైదరాబాద్ మార్గంలో ఆర్డినరీ బస్సులకు ఎక్స్ ప్రెస్ బోర్డులు**
**- గేట్ల వద్ద స్టాప్ లేదంటున్న వైనం, గ్రామీణ ప్రయాణికుల అవస్థలు**







**కడ్తాల్, అక్టోబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఆర్టీసీ బస్సు చార్జీలను ఇప్పటికే పెంచిన యాజమాన్యం, ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతోంది. ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించాలనే లక్ష్యంతో డీజిల్ సెస్, చిల్లర సర్దుబాటు పేరు తో సుమారు 50శాతం చార్జీలు పెంచింది. అది చాలదన్నట్టు ఆర్డినరీ బస్సులను ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా నడుపుతోంది. స్టాప్ లేకున్నా బస్సును నిలిపి అధిక చార్జీ వసూలు చేస్తుండగా, ప్రయాణికులు ఆర్థిక నష్టానికి, అసౌకర్యానికి గురవుతున్నారు. కల్వకుర్తి, అచ్చంపేట డిపో నుంచి హైదరాబాద్ నగరానికి గతంలో ఆర్డినరీ బస్సులు చాల ఉన్నాయి. కాని ఆర్డినరీ బస్సులే ఎక్స్ ప్రెస్ లుగా మార్చారు.

**ఆర్డినరీ బస్సులు ఎక్స్ ప్రెస్ బస్సులుగా..**
ఆర్డీనరీ బస్సుల్లో సీటింగ్ మార్చకుండా, వేగం పెంచకుండా ఎక్స్‌ప్రెస్ బోర్డు తగిలించి నడుపుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు అన్ని స్టేజీల వద్ద నిలపకపోవడంతో ఆ రూట్లలో ఉండే గ్రామీణ ప్రాంత ప్రజలు చివరికి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కరోనా సమయంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను నిలిపిన సంస్థ కొన్ని ప్రాంతాలకు నేటికీ బస్సులను పునరుద్ధరించలేదు. ఏళ్లు గడిచినా గ్రామాల నైట్‌హాల్ట్ బస్సులను పునరుద్ధరించలేదు. దీంతో ఆయా రూట్లలో ఉన్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అధిక చార్జీ చెల్లిస్తూ, భద్రతలేని ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇక ఆర్డినరీ బస్సులను ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా నడపడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక అన్ని స్టేజీల వద్ద బస్సు నిలవదు. దీంతో చాలా మంది విద్యార్థులు బస్ పాస్ తీసుకోవడం మానేశారు. కల్వకుర్తి - హైదరాబాద్ మార్గంలో గతంలో ఉన్న పల్లె వెలుగు బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్న పరిస్థితి. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్డినరీ సర్వీస్ లను నడపాలని గ్రామీణ ప్రయాణికులు వేడుకుంటున్నారు.

## కావేరి యూనివర్సిటీ, సీడ్స్ కంపెనీ సందర్శించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**వర్గల్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని కావేరి విశ్వవిద్యాలయం మరియు కావేరి సీడ్స్ కంపెనీని సందర్శించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. యూనివర్సిటీ చాన్సిలర్ జీ.వి. భాస్కరరావు, వైస్ చాన్సిలర్ డాక్టర్ వి. ప్రవీణ్ రావు సమక్షంలో ఆర్&డి విభాగాలు, ల్యాబ్స్, డ్రోన్, రోబో, 3D ప్రింటింగ్, AR/VR మోడల్స్ పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభించి టిష్యూ కల్చర్, జినోమిక్స్, స్పీడ్ బ్రీడింగ్, ప్లాంట్ హెల్త్ ల్యాబ్స్, జీన్ బ్యాంక్లను అభినందించారు. గవర్నర్ మాట్లాడుతూ, "విద్యార్థులు సమాజ మార్పుకు దిక్సూచి కావాలి. విజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి" అని సూచించారు. రాష్ట్ర విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో వి. చంద్రకళ, తాసిల్దార్ రఘువీరా రెడ్డి, ఏసిపి నరసింహులు, సిఐ మహేందర్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష పొలసాని, డీన్లు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు వివాహ శుభకార్యాలలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి





**అబ్దుల్లాపూర్ మెట్. అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో పలు వివాహ శుభాకార్యాలల్లో పాల్గొని వధూ వరులను ఆశీర్వధించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి. మాజీ ఎంపీటీసీ కోడిశెట్టి వెంకటేష్ నాయకులు బుర్ర మహేందర్ గౌడ్. గుండ్ల ధనరాజ్ గౌడ్. మాజీ మండల్ కో ఆప్షన్ నెంబర్ మహమ్మద్ గౌస్ పాష తదితరులు పాల్గొన్నారు

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**ఎస్ పి శరత్ చంద్ర పవార్**



**నల్లగొండ ,అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాలోని 40 మంది రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించారు కౌన్సిలింగ్లో రౌడీ షీటర్స్ కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఎవరైనా భూసెటిల్మెంట్లు, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అసాంఘిక చర్యలపై PD యాక్ట్ నమోదు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, సిఐ రాఘవరావు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్ కుమార్



**ధర్మారం, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "రైతులు కష్టపడి పండించిన వడ్లను ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలి. మిల్లర్లతో మాట్లాడే బాధ్యత అధికారులదే. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత" అని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్ల కొనుగోలు, బోనస్ అందజేత కూడా జరుగుతుందని తెలిపారు. 'వడ్ల కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే, మీ అన్నగా నాదే బాధ్యత" అని మంత్రి పేర్కొన్నారు.

## సురభి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



**హుస్నాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సురభి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు సురభి మెడికల్ కళాశాల మిట్టపల్లి వారి ఆధ్వర్యంలో శుక్రవారం హుస్నాబాద్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డీన్ డా. రఫీ, సీఈడీ డా. దీప్తి రావు మాట్లాడుతూ, "ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. హాస్పిటల్‌లో అందుతున్న సేవలపై అవగాహన కల్పించాం" అని తెలిపారు. 580 మందికి పైగా ప్రజలు శిబిరానికి హాజరయ్యారు. 360 రక్త పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ, ఆపరేషన్ అవసరమున్నవారిని హాస్పిటల్‌కు రెఫర్ చేయడం జరిగింది. కార్యక్రమంలో డీఎంసీ డా. శ్యామ్, ఇంటెన్సివిస్ట్ డా. యోగేందర్, ఏసీపీ సదానందం, ఎస్సై లక్ష్మారెడ్డి, ఎఎంసీ ఛైర్మన్ తిరుపతి, వైస్ ఛైర్మన్ చందు, సింగిల్ విండో ఛైర్మన్ శివయ్య, ఎంపీపీ వెంకన్న, కౌన్సిలర్లు సది, పద్మ, వాలా నవీన్, పందిళ్ల సర్పంచ్ రమేష్, 60 మంది సీనియర్ డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, మార్కెటింగ్ బృందం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌లో వే బ్రిడ్జి, డయ్యర్ యంత్రాలు నిరుపయోగం

**బీఎస్పీ, కిసాన్ సంఘ్ ఆవేదన**




**హుస్నాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పది సంవత్సరాల క్రితం ప్రారంభించిన వే బ్రిడ్జి ఇప్పటికీ పనిచేయకపోవడం వల్ల రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, కిసాన్ సంఘ్ నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బయట తూకం కేంద్రాల్లో మోసాలు జరుగుతున్నాయని, మార్కెట్ వే బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలని, అలాగే 13%-14% తేమ శాతం గుర్తించే వ్యవసాయ యంత్రం డయ్యర్ కూడా పనిచేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలతో ధాన్యం నానిపోవడం రైతుల పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. హుస్నాబాద్ మార్కెట్ రాష్ట్రంలో పెద్ద మార్కెట్‌గా గుర్తింపు పొందినప్పటికీ, మినీ ఫంక్షన్ హాల్, కూరగాయల మార్కెట్ భవనం వంటి నిర్మాణాలు సరైన వసతుల లేక పనికిరాని స్థితిలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సొంత నిధులతో రూ.4 కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం ఉపయోగంలోకి రావాలని బీఎస్పీ, కిసాన్ సంఘ్ విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మార్కెట్ పాలకవర్గం ఈ అంశాలపై సత్వర చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు.

## పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటాం



**మహేశ్వరం, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గం పహాడీ షరీఫ్‌లో భర్తను కోల్పోయిన మహిళా జనరల్ సెక్రటరీ సయ్యద్ తపస్సును కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సమత ప్రకాష్ శుక్రవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎల్ఆర్ ఆదేశాల మేరకు ఈ పరామర్శ జరిగింది. "పార్టీని నమ్ముకుని సేవలందించిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. కాంగ్రెస్ అంటే ప్రజల పార్టీ, ప్రజా ప్రభుత్వం" అని సమత ప్రకాష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బడంపేట మున్సిపల్ అధ్యక్షురాలు అమృత నాయుడు, మీర్పేట్ అధ్యక్షురాలు పద్మశ్రీ, జలపల్లి అధ్యక్షురాలు నజీం సుల్తానా, ఇతర మహిళా నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మార్వో ని సన్మానించిన బి ఆర్ ఎస్ నాయకుడు కంది కంటి విజయకుమార్



**అబ్దుల్లాపూర్ మెట్. అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అబ్దుల్లాపూర్ మెట్ మండల రెవెన్యూ ఆఫీసులో బి ఆర్ ఎస్ నాయకుడు కంది కంటి విజయ్ కుమార్ అబ్దుల్లాపూర్ మెట్ మండల రెవెన్యూ అధికారి బి సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాల తో సన్మానించడం జరిగింది.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

- బీఆర్ఎస్



**హుస్నాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు మేకల వికాస్ యాదవ్, రైతులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడం, కొనుగోలు కేంద్రాల్లో అనేక అడ్డంకులు, స్థలాభావం వల్ల ధాన్యం తడవడం, మిల్లర్ల తరుగు పేరిట కట్టింగ్ వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా నష్టపెట్టుతున్నాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులు పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన పంట చేతికి వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం లేకుండా వర్షాల్లో నాశనం అవుతోంది. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి" అని అయిలేని మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్‌లో తారీపిన్, నిల్వ స్థలాలు, వర్షపు నీరు నిలవకుండా చేసే ఏర్పాట్లు, కొనుగోళ్లు వేగవంతం చేయడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

# అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ముందుకు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ పశ్చిమ, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వరంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా, 57వ మరియు 59వ డివిజన్‌లలో రూ.4.07 కోట్ల వ్యయంతో చేపట్టిన అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం" అని తెలిపారు. హనుమకొండ అశోక హోటల్ ఎదురుగా పాత మున్సిపాలిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టిబెటియన్ ఉలెన్ స్వెటర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా ప్రారంభించారు. "ఈ మార్కెట్ శీతాకాలంలో ప్రజలకు నాణ్యమైన ఉలెన్ దుస్తులు అందిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టిబెటియన్ వ్యాపారులు వరంగల్ ప్రజలతో decades పాటు స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నారు" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే, "స్థానికులు చిన్న వ్యాపారులు, హస్తకళాకారులను ప్రోత్సహించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, నాయకులు బిల్ల రమణ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటల్లో గెలుపు ఓటములు సహజం

-ఎంఈఓ మనీలా

**హుస్నాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ పోటీల్లో కబడ్డీ బాలికల విభాగంలో మైనారిటీ స్కూల్, వాలీబాల్‌లో మోడల్ స్కూల్ టీం విజయం సాధించాయి. 100 మీటర్ల రన్నింగ్‌లో రిస్వంత్ మొదటి, సిద్ధార్థ్ రెండవ, హుస్సేన్ మూడవ స్థానాల్లో నిలిచారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో గంగిశెట్టి అఖిల్ విజేతగా, మనీచందర్ రన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ మనీలా గారు గెలుపొందిన క్రీడాకారులకు క్రీడా సామగ్రి, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, "ఆటల్లో గెలుపు ఓటములు సహజం. శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం. సెల్‌ఫోన్‌కు బదులుగా క్రీడల వైపు మొగ్గు చూపితే యువత జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరగలదు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి, బీజేపీ నాయకులు పోలోజు రాజేందర్, వరియోగుల అనంతస్వామి, అశాడపు శ్రీనివాస్, నారోజు నరేష్, ఇతర నాయకులు, పీఈటీలు, ఎంపైర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# వెలిచాలలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జగిత్యాల మెయిన్ రోడ్డు నుండి వెలిచాల గ్రామం వరకు సుడా నిధులతో రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, "చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి సుడా నిధుల ద్వారా పలు పనులు చేపడుతున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సూచించాం" అని తెలిపారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "అవసరమైన చోట, మంత్రులు మరియు ఎమ్మెల్యేల సూచనల మేరకు అభివృద్ధి నిధులు తప్పకుండా కేటాయిస్తాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీర్ల వెంకటేశ్వర్ రావు, జవాజీ హరీష్, వీర్ల నర్సింగ రావు, కాడే శంకర్, డీఈ రాజేందర్ ప్రసాద్, ఏఈ సతీష్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. మంజూరునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పత్తి రైతులకు సూచనలు తెలిపే గోడ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల చివరి వారంలో పత్తి కొనుగోలు ప్రారంభం కానుంది. రైతులు ముందుగా కపాస్ కిసాన్ అప్లికేషన్ డౌన్లోడ్ చేసి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆధార్ లింక్‌తోనే డబ్బులు ఖాతాలో జమవుతాయి. దళారుల వద్ద పత్తిని అమ్మకూడదు" అని స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పత్తికి మద్దతు ధర రూ.8110 నిర్ణయించబడిందని తెలిపారు. "ఈ సంవత్సరం పత్తి కొనుగోలు సక్రమంగా జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ సెక్రటరీ మహమ్మద్ లా షరీఫ్, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రాయిగడ్డలో పారిశుద్ధ్యం పనులు



**వనపర్తి,అక్టోబర్ 24( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు రాయిగడ్డ కాలనీలో శుక్రవారం పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. కంపచెట్లు,పిచ్చి మొక్కలతో ఇబ్బందులు ఎదుర్కొన్న కాలనీవాసులు కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దేవన్న నాయుడు స్పందిస్తూ మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పరిశుద్ధ పనులు నిర్వహించారు. ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను జెసిబి సాయంతో తొలగించారు ఈ సందర్భంగా దేవన్న నాయుడు మాట్లాడుతూ.. ఆయా కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలం సందర్భంగా కంప చెట్లు పిచ్చి మొక్కలతో మరుగు ఏర్పడడంతో విష సర్పాలు సంచరించి ప్రమాదం ఉందని కాలనీవాసులు జాగ్రత్తలు పాటించాలని దేవన్న సూచించారు. కాలనీలోని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని రోగాల బారిన పడకుండా కాపాడుకోవాలని దేవన్న నాయుడు కాలనీవాసులకు సూచించారు. సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే మేఘా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్, కాంగ్రెస్ నేత దేవన్న నాయుడు, మున్సిపల్ సిబ్బందికి రాయిగడ్డ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సరస్వతిగూడ భూ సమస్యలపై కేఎల్ఆర్ హామీ



**తుక్కుగూడ, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని సరస్వతిగూడ గ్రామంలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించాలని లిమహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్)లిను గ్రామస్తులు తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భూములపై ఉన్న వివాదాలను గ్రామస్తులు వివరించారు. కేఎల్ఆర్ మాట్లాడుతూ, "ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రభుత్వ అధికారులతో రీ-సర్వే చేయించి, ఇరువర్గాలకు న్యాయం చేస్తాను" అని హామీ ఇచ్చారు. గ్రామస్తులు "మాకు న్యాయం చేయండి సార్" అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

# కూలీ రేట్లు పెంచకపోతే నవంబర్ 12 తర్వాత సమ్మె

- ఏఐటీయూసీ హెచ్చరిక



**గోదావరిఖని, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు పాత కూలీ రేట్లు చెల్లిస్తున్నారని, కొత్త రేట్లు పెంచకపోతే నవంబర్ 12 తర్వాత సమ్మెకు పిలుపు ఇస్తామని ఏఐటీయూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఎ. గౌస్ హెచ్చరించారు. శుక్రవారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "గత మూడు సంవత్సరాలుగా వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్‌కు విన్నవించినా స్పందన లేదు. కరీంనగర్ జిల్లా లేబర్ అధికారికి ఫిర్యాదు చేశాం. బుధవారం చర్చ సందర్భంగా నవంబర్ 12న సమస్య పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు" అని తెలిపారు. "ఆ రోజున వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ లేబర్ కమిషనర్ వద్దకు వచ్చి కూలీ రేట్లు పెంచకపోతే, నవంబర్ 12 తర్వాత సమ్మెకు పిలుపు ఇస్తాం" అని గౌస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలిపెల్లి సతీష్, రాంచందర్, జానీమియ, బండారి రవి తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**వనపర్తి అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**



వనపర్తి మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి భూమి పూజ చేశారూ ఈ కార్యక్రమానికి వచ్చిన ఆయనకు మత్స్యకారులు ఘనంగా స్వాగతం పలికారు వనపర్తి నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు కార్యక్రమంలో వనపర్తి పట్టణ మత్స్య సహకార సంఘ సభ్యులు, మత్స్యకారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పేకాట రాయుళ్లు అరెస్ట్



**తనకల్లు అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తనకల్లు మండలంలోని కోటూరు గ్రామ పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం రావడంతో తనకల్లు ఎస్సై గోపీనాథ్ తన సిబ్బందితో కలిసి రైడ్ నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.2,450/- నగదు స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయబడినట్లు ఎస్సై గోపి తెలిపారు.

## గో రక్షక్‌పై దాడి చేసిన నిందితులకు కఠిన శిక్ష విధించాలి



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గో రక్షక్ ప్రశాంత్ సింగ్ సోనుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఎంఐఎం గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీని కోరారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివయ్య గౌడ్, నారాయణరెడ్డి, బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాగేంద్ర గౌడ్, చెవ్వ ప్రమోద్ కుమార్, హేమాద్రి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, "గో రక్షకులపై దాడులు సహించలేము. నిందితులకు కఠిన శిక్ష విధించాలి" అని డిమాండ్ చేశారు.

## పశువుల దావకాన లేక రైతులు ఇబ్బందులు



**మహేశ్వరం, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామ రైతులు పశువుల దావకాన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉన్న ఈ గ్రామంలో పశుపోషణ ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులు, పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. చిన్న గోల్కొండ పశువైద్యశాలకు వెళ్లినా "మీ ఊరు మా పరిధిలోకి రాదు" అంటూ అధికారులు తిరస్కరిస్తున్నారని, దుబ్బచెర్ల పశువైద్యశాలకు దాదాపు 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ఇది రైతులకు భారంగా మారిందని తెలిపారు. "మా ఊరికి పశువుల దావకాన ఏర్పాటు చేస్తే, పెద్దపులి నాగారం తో పాటు పడమటి తండా, నందుపల్లి, చిన్న తండాల రైతులకు కూడా మేలు జరుగుతుంది" అని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## గ్రామాల అభివృద్ధే నా ధ్యేయం

-ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**తెలకపల్లి, అక్టోబర్ 24 (నీ దగ్గర ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి గురువారం ఉదయం తెలకపల్లి మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.8 లక్షల నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద రూ.10 లక్షల వ్యయంతో ఆరో వార్డులో మరో సీసీ రోడ్డు పనికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలు ఇచ్చిన పదవికి న్యాయం చేయడం నా బాధ్యత. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి పనులు తీసుకురావడమే నా లక్ష్యం. ఇప్పటికే రూ.1000 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. పరిశుభ్రమైన నీరు, రోడ్లు, కరెంటు, వైద్య సదుపాయాలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాను" అని తెలిపారు. తెలకపల్లి పెద్ద చెరువుకు వరద నీరు వెళ్లే కాలువ వల్ల రోడ్డు దెబ్బతినడం, వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో వార్డు సభ్యుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. "ఆత్మకమైన సమస్యలు గుర్తించి వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. పరిష్కారానికి నేను సిద్ధంగా ఉంటాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, వెంకటయ్య గౌడ్, వారణాసి శ్రీనివాసులు, నరసింహ, శారద, రామకృష్ణ, మైకేల్, కుర్మయ్య, మల్లేష్, అనిల్ రాజు, కిరణ్, జిలాని, నిస్సార్, ఫరీద్, మాక్సూద్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించిన ఎమ్మెల్యే

**దేవరకొండ అక్టోబర్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా మారిన ఓటు చోరికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శుక్రవారం గుడిపల్లి గ్రామంలో 'సంతాకాల కార్యక్రమం'ను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరి, ఎన్నికల్లో మోసాలు, ప్రజల ఓటు హక్కును దుర్బలపరచే కుట్రల గురించి ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటే ప్రధాన బలమని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరికి పాల్పడుతూ దేశ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ చేస్తున్న ఈ కుటిల రాజనీతికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ప్రజలను చైతన్యం చేస్తామని అన్నారు. అదేవిధంగా ఓటు చోరికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామ్య



వాదులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా అవకతవకలు జరిగినట్లు తెలిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయాలని సూచించారు. అలాగే, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి యువత బాధ్యత వహించాలని, సోషల్ మీడియా ద్వారా ప్రజలలో అవగాహన వ్యాప్తి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం వ్యాప్తంగా మరిన్ని గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సొంత చెల్లె(పెద్దమ్మ కూతురు)ని ఏడు నెలల గర్భవతిని చేసిన కేసులో శిక్ష

**21 సంవత్సరాల కారాగార శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా ఫోక్సో కోర్టు ఇన్చార్జి న్యాయమూర్తి రోజారమణి తీర్పు**

**నల్లగొండ ,అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కట్టంగూర్ మండలం కురుమర్తి కి చెందిన సొంత పెద్దమ్మ కూతురు అయిన మైనర్ బాలిక(16 సంవత్సరాలు) ను రేప్ ఏడు నెలల గర్భవతిని చేసిన సంఘటనలో నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 09 జూన్ 2021న కేసు నమోదు చేశారు .పోలీసుల విచారణలో నల్లగొండ టౌన్ బొట్టుగూడ కు చెందిన చింతపల్లి నగేష్ సొంత చెల్లెలైన మైనర్ బాలికను మూడు రోజులు బొట్టుగూడలో ఉంచి రేప్ చేసినట్లు రుజువైంది బాధిత మైనర్ బాలిక కు తల్లిదండ్రులు లేరు ...



ఎవ్వరు దిక్కు లేరనే దారుణానికి ఒడిగట్టిన నిందితుడు. నిందితుని పై నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 376,(2)(n),506 IPC 5(i)(ii),5(1),5(n) r/w 6 of POCSO ACT కింద కేసు నమోదు క్రైమ్ నెంబర్:214/2021 SC NO:234/2021 నిందితుడికి 30,000 రూపాయల జరిమానా ... బాధితురాలికి 10,00,000 (పది లక్షల రూపాయల) పరిహారం, ఇవ్వాలని తుది తీర్పు ఇచ్చిన ఇన్చార్జి న్యాయమూర్తి రోజా రమణి ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు ఐవోలుగా ఎన్.సురేష్, వి.బాలగోపాల్, ప్రస్తుత ఎస్.హెచ్.ఓ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి వ్యవహరించారు.

## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెంట్లవెల్లి కేజీబీవీ విద్యార్థిని సంధ్యను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం కలెక్టరేట్‌లో శాలువాతో సన్మానించారు. హైదరాబాద్‌లో ఈ నెల 16-18 తేదీల్లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ టోర్నీలో సంధ్య అద్భుత ప్రదర్శన కనబరిచిందని కలెక్టర్ ప్రశంసించారు. ఆమెను తీర్చిదిద్దిన పీఈటీ రాజేశ్వరిను కూడా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటే మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారు. గెలుపు-ఓటములు సహజం. ఓడినవారు పట్టుదలతో మళ్లీ ప్రయత్నించి విజయం సాధించాలి" అని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను వివిధ క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, కేజీబీవీ పర్యవేక్షణ అధికారి శోభారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా



**వెల్దండ, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం వెల్దండ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీ కాలనీ తండాకు చెందిన రాతలవత్ రవి (33) మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు టెస్ట్‌లో నిర్ధారణ కావడంతో కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి జాడ కావ్య విచారణ అనంతరం ఒక రోజు సాధారణ జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించారు. ఈ విషయాన్ని వెల్దండ ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లి, బిడ్డ క్షేమం



**కల్వకుర్తి, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలికట్ట గ్రామానికి చెందిన మహేశ్వరికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. కల్వకుర్తి నుండి సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్, కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో కురుమిద్ద శివారులోనే అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వరప్రసాద్, పైలట్ అశోక్ సమర్థంగా స్పందించి నాలుగవ సంతానంగా పాప జన్మించేందుకు సహాయపడ్డారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఆసుపత్రికి తరలించబడ్డారు. మహేశ్వరి కుటుంబం అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.

## ప్రజల అవసరాల కోసం చెట్ల తొలగింపు

మాజీ సర్పంచ్ ముక్తాల శేఖర్ సేవా దృక్పథం



**వెల్దండ, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని కుప్పగండ్ల గ్రామం నుండి గొల్లోనిపల్లి వరకు రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లు, వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో, మాజీ సర్పంచ్ ముక్తాల శేఖర్ స్వయంగా తన సొంత ఖర్చుతో వాటిని తొలగించారు. చెట్ల పెరుగుదల వల్ల ప్రమాదాలు చోటుచేసుకోవడం, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని, మానవతా దృక్పథంతో ఈ చర్య చేపట్టిన శేఖర్‌కు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోల్లోనిపల్లి గ్రామ పెద్దలు, యువకులు, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మందమర్రిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్**



**మందమర్రి, అక్టోబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచిర్యాల జిల్లా మందమర్రి మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి అభివృద్ధి పనుల పురోగతిని, పారిశుధ్య నిర్వహణను, నర్సరీల నిర్వహణను, త్రాగునీటి సరఫరాను, రెండు పడకగదుల ఇండ్ల నిర్మాణాన్ని సమీక్షించారు. మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. త్రాగునీరు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, నర్సరీలలో నాటేందుకు అవసరమైన మొక్కలను అభివృద్ధి చేసి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని, మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రెండు పడకగదుల ఇండ్ల పథకం కింద నిర్మించిన భవనాలను పరిశీలించిన కలెక్టర్, అమృత్ 2.0 పథకం కింద కొనసాగుతున్న నీటి ట్యాంకుల నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటిని సరఫరా చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం గద్దెరాగడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ కార్యాలయాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, డిప్యూటీ రీజినల్ హెడ్ (ఎ.జి.ఎం.) రాధాకృష్ణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, శాఖ మేనేజర్ సంజీవ్ తలకోటి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం ద్వారా ప్రజలకు, వినియోగదారులకు బ్యాంకు సేవలు మరింత చేరువలోకి వస్తాయని తెలిపారు. పొదుపు, బీమా, పెన్షన్, పెట్టుబడులు తదితర అంశాల్లో సేవలు అందించడంతో పాటు, ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాఖ అభివృద్ధికి బ్యాంక్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, తద్వారా జిల్లా అభివృద్ధికి తోడ్పాటు కలుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

# శ్రీ వర్షిత ఆత్మహత్య

**“ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే” : ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**



**హుజురాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగర గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న శ్రీ వర్షిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. “ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే” అని ఆరోపించారు. అంబేద్కర్ చౌరస్తాలో వర్షిత మృతదేహంతో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, “ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక వర్షిత మరణించింది. విద్యాశాఖను తన ఆధీనంలో పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పేద విద్యార్థులకు న్యాయం చేయడంలో విఫలమయ్యారు. వెంటనే రాజీనామా చేయాలి” అని డిమాండ్ చేశారు. వర్షిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా, ప్రిన్సిపల్ సస్పెన్షన్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల రక్షణపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. “కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యాసంస్థల్లో ఎలుకలు, కుక్కలు, కోతులు కరిచిన ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం” అని విమర్శించారు. మృతురాలి కుటుంబానికి రూ.50,000 ఆర్థిక సహాయం ప్రకటించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వెంట తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు**



**పెద్దపల్లి, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓదెల మండలంలోని గుండ్లపల్లి, కనగర్తి, పిట్టలఎల్లయ్యపల్లి, హరిపురం గ్రామాల్లో సింగిల్ విండో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోంది. రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు, దళారుల మోసాలకు రైతులు బలికాకుండా, ప్రభుత్వమే మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తోంది” అని పేర్కొన్నారు. “రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు డబ్బులు వెంటనే ఖాతాల్లో జమ అవుతాయి. సన్న వడ్ల బోనస్ కూడా నేరుగా రైతులకు చెల్లించబడుతుంది. గత ప్రభుత్వ హయాంలో రైతులు పంట అమ్మకానికి ఎన్నో అవస్థలు ఎదుర్కొనేవారు. ‘కటింగ్’ పేరుతో దోపిడీ జరిగేది. కానీ ఇప్పుడు, రైతులు దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వమే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యం అమ్మే అవకాశం కల్పిస్తోంది” అని ఎమ్మెల్యే విజయరమణ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని ఆత్మహత్యపై విచారణకు ఆదేశం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భీమదేవరపల్లి మండలం వంగరలోని పీవీ గురుకుల పాఠశాలలో టెన్త్ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హుజురాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన విద్యార్థిని ఘటనపై హనుమకొండ కలెక్టర్‌తో మాట్లాడి, పూర్తి స్థాయి విచారణ జరిపించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. “ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది” అని మంత్రి పేర్కొన్నట్లు సమాచారం.

## 57 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరంలో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో ట్రాఫిక్ పోలీసులు 57 కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను పట్టుకుని, వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులపై కోర్టు విచారణ అనంతరం, రూ.3,63,000 జరిమానా వాహనదారులు చెల్లించినట్లు పోలీసులు వెల్లడించారు. “మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు విధించబడతాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రహదారి భద్రతను నిర్లక్ష్యం చేయరాదు” అని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపు



**వేములవాడ, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో రమాదేవీ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. లెక్కింపు ప్రక్రియలో ఆలయ ఉన్నతాధికారులు, సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొంటున్నారు. పోలీసు, ఎస్పీఎఫ్ సిబ్బంది నిఘా నీడలో హుండీ లెక్కింపు కొనసాగుతోంది. భక్తుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా, పారదర్శకంగా లెక్కింపు జరుగుతోందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

## స్వంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**కరీంనగర్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్సేనీపురాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో శుక్రవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పది సంవత్సరాల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఊదరగొట్టి ఒక్క ఇల్లు కూడా కట్టించలేకపోయింది. కానీ ఈనాడు అయినా, ఆనాడు అయినా, ఇండ్లు నిర్మించి ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే” అని పేర్కొన్నారు. “స్వంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ప్రతి అర్హుడికి నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది” అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు షబానా మహమ్మద్, సమద్ నవాబ్, హనీఫ్, మీరజ్, మసూమ్, ఖలీల్, బషీర్, జాఫర్, ముల్కల కవిత, అస్తపురం తిరుమల, ఊరడి లత తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి జాబ్ మేళా, ప్రజాభిప్రాయ సేకరణపై డీసీపీతో జీఎం చర్చ



**మంచిర్యాల, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ శుక్రవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో డీసీపీ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ, డీసీపీని శాలువాతో, బొకేతో సన్మానించారు. ఈ భేటీలో అక్టోబర్ 26న బెల్లంపల్లి సింగరేణి ఏఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా, డిసెంబర్ 3న రామకృష్ణాపూర్‌లో జరగనున్న ఆర్కే.పి.ఓ.సి ఫేస్ 2 ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురించి చర్చించారు. ఈ కార్యక్రమాల నిర్వహణ, భద్రత, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఏరియా సెక్యూరిటీ అధికారి రవి పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అప్పగింపు



**సిద్దిపేట, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ సాంకేతికత ద్వారా గుర్తించి, బాధితులకు తిరిగి అప్పగించినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపారు. గత నెల రోజుల క్రితం వేముల జంగిటి కృష్ణయ్య, కిమ్మసారం చందు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సాంకేతికత ద్వారా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, అనంతరం బాధితులకు అధికారికంగా అప్పగించామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ, “చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయకూడదు. అవి చోరీకి గురైనవై ఉండే అవకాశం ఉంది” అని సూచించారు.

# కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్**




**పెద్దపల్లి, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టి.యూ) పెద్దపల్లి జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం గోదావరిఖని ఐ.ఎఫ్.టి.యూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఈ. నరేష్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన ఐ.ఎఫ్.టి.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, "రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో ముఖ్యంగా సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, బసంత్‌నగర్, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ ఆసుపత్రులు తదితర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, స్కీమ్ వర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. "పని గంటల పరిరక్షణ, సమాన పనికి సమాన వేతనం, సింగరేణి సహా వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న మూడు లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు, రాష్ట్ర పరిధిలో ఉన్న లక్షా యాభై వేల మంది కార్మికులను శాశ్వతంగా నియమించాలని" డిమాండ్ చేశారు. లేబర్ కోడులను ఆధారంగా తీసుకుని, 8 గంటల పని దినాన్ని 10 గంటలకు మార్చే ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. "ఇది కార్మిక వ్యతిరేక విధానం. దీనిపై బలమైన కార్మిక ఉద్యమాలు నిర్మించాలి" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐ.ఎఫ్.టి.యూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ. శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు ఐ. కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు చిలుక శంకర్, జిల్లా నాయకులు బి. బుచ్చమ్మ, ఐ. రాజేశం, జి. మల్లేశం, ఎడ్ల రవికుమార్, ఎస్. ప్రసాద్, బండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఆత్మాహుతి దాడికి ప్లాన్..

**ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్ట్**




**న్యూఢిల్లీ: అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశరాజధాని ఢిల్లీ లో పోలీసులు భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. నగరంలో ఆత్మాహుతి దాడులకు కుట్ర పన్నిన ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు. నిఘా సంస్థల నుంచి అందిన పక్కా సమాచారంతో ఢిల్లీలోని సాదిక్‌నగర్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక దళం (స్పెషల్ సెల్) సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో ఆత్మాహుతి దాడుల కోసం శిక్షణ పొందుతున్న ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు.నిందితుల్లో ఒకరు భోపాల్‌కు చెందిన అద్నాన్ కాగా.. మరొకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఓ రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. నిందితులకు ఐసిస్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. విచారణ సందర్భంగా ఢిల్లీలో ఆత్మాహుతి దాడికి ప్లాన్ చేసినట్లు వారు అంగీకరించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వారి నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై మరింత సమాచారం రాబట్టేందుకు విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

## రియల్ ఎస్టేట్ పేరుతో కోటి రూపాయల ఘరానా మోసం - నిందితుడు అరెస్టు




**మంచిర్యాల, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో మంచిర్యాల జిల్లాకు చెందిన రామిడి సంపత్ రెడ్డి కోటి రూపాయల మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. 2021లో తాను తక్కువ ధరకు భూములు అందిస్తానని చెప్పి బాధితులను మాయమాటలతో మోసం చేసి, వారి వద్ద నుండి సుమారు కోటి రూపాయలు వసూలు చేశాడు. అయితే, వాస్తవంగా ఎటువంటి భూములు చూపించకుండా వాయిదాలు వేస్తూ బాధితులను మోసం చేశాడు. ఈ నేపథ్యంలో బాధితులు జనవరి నెలలో హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గురువారం నిందితుడిని అరెస్టు చేశామని హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు.

## ప్లే స్కూల్‌లకు కావలసిన ఆట వస్తువుల టెండర్ ప్రక్రియ



**సిద్దిపేట, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 51 ప్లే స్కూల్‌లకు అవసరమైన ఆట వస్తువులు, ఫర్నిచర్ తదితర సామాగ్రి కోసం టెండర్ ప్రక్రియ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ టెండర్ ప్రక్రియలో 8 కంపెనీల ప్రతినిధులు తమ సంస్థలు తయారు చేసిన ఆట వస్తువులు, కుర్చీలు, టేబుళ్లు తదితర సామాగ్రిని ప్రదర్శించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం ప్లే స్కూల్‌లలో చిన్నారులకు ఇబ్బంది లేకుండా, స్వేచ్ఛగా ఆడుకునేలా, సృజనాత్మక ఆలోచనలు వెలువడేలా ఆట వస్తువులు ఉండాలి. నాణ్యత పరంగా మంచి బ్రాండ్ వస్తువులు మాత్రమే ఎంపిక చేయాలి. పిల్లలు కింద పడినా పగలకుండా ఉండేలా, పట్టుకోవడానికి, కూర్చోవడానికి అనువుగా ఉండాలి" అని సూచించారు. అనంతరం ప్రభుత్వ నిర్దేశించిన రేటుకు టెండర్‌ను ఫైనల్ చేసి, తయారీ బాధ్యతలను 8 కంపెనీలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, డబ్ల్యు ఓ శారద, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య తదితరులు పాల్గొన్నారు.

## నౌకాదళం అమ్ములపొదిలోకి 'మాహే'




**కొచ్చి: అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జలాంతర్గాముల విధ్వంసక యుద్ధ నౌక మాహే భారత నావికా దళం అమ్ములపొదిలోకి చేరింది. దీంతో నావికా దళం సత్తా మరింత పెరిగింది. దీనిని కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించింది ఎనిమిది యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్‌ను నిర్మించే ప్రాజెక్టులో మాహే మొదటిది. మిగిలిన వాటిని రానున్న సంవత్సరాల్లో నావికా దళానికి అప్పగిస్తారు. పుదుచ్చేరిలోని చరిత్రాత్మక నౌకాశ్రయ పట్టణం మాహే పేరును ఈ యుద్ధ నౌకకు పెట్టారు.

## మామిడి అరవింద్, దివ్య లకు ప్రధాని మోదీ ఆశీస్సులు....



सत्यमेव जयते

प्रधान मंत्री
Prime Minister

New Delhi
आश्विन 29, शक संवत् 1947
21 October, 2025

**Smt. Laxmi & Shri Mamidi Narsingh Rao Garu,**

As **Chi. Aravind** and **Sou. Divya** commence the journey of trust and togetherness for a lifetime, heartiest congratulations and greetings to them on the auspicious occasion of their wedding. Heartfelt gratitude for inviting me to the wedding ceremony on 26 October, 2025.

As the couple build a life together, may the joy they find in each other grow brighter and the bond between the two remain unbreakable. Here is wishing them a lifetime of happiness and treasured moments.

May the couple's hearts, minds and actions be one. Being there by each other's side at all times, holding each other's hands in their quest to realise their dreams and aspirations, assuming responsibilities thoughtfully and affectionately, may the groom and the bride be perfect partners in the voyage of life by accepting each other's imperfections and learning from each other's virtues.

I once again extend my greetings and best wishes to you and the couple on the momentous occasion.

Warm regards,

Yours,

(Narendra Modi)

**Shri Mamidi Narsingh Rao Garu**
H.No. 8-1-289/B/6, Dwaraka Nagar
Shaikpet, P.O. Golconda Fort
Hyderabad

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ మాజీ మెంబర్ మామిడి లక్ష్మీబాయి మరియు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగ్ రావు దంపతుల తనయుడు ఈనెల 26న వివాహము జరగనున్న మామిడి అరవింద్ - దివ్యలకు ఫిల్మ్ నగర్ ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులను అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ తల్లిదండ్రులు మామిడి లక్ష్మీబాయి - నర్సింగ్ రావులకు రాసిన లేఖలో అరవింద్ దివ్యలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ప్రేమానురాగాలతో కలకాలం వర్ధిల్లాలని ప్రధాని ఆ లేఖలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా మామిడి లక్ష్మీబాయి - నర్సింగ్ రావు దంపతులు మాట్లాడుతూ వారి చిన్న కుమారుడు అరవింద్ కు ఆశీస్సులు ప్రధాని నేరుగా ఆశీస్సులు అందజేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## వెనిజువెలా సమీపంలో అమెరికా బాంబర్లు

**వాషింగ్టన్, అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో వెనిజువెలా జలాల్లోని నౌకలపై దాడులు చేయిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు వెనిజువెలా సరిహద్దులో బాంబర్లను మోహరించారు. వెనిజువెలా తీరంలో అమెరికా యుద్ధ విన్యాసాలను ప్రదర్శించింది.ప్పటికే కరేబియన్ సముద్రం, వెనిజువెలా జలాల్లో అమెరికా సైన్యం అసాధారణంగా పెద్దయెత్తున బలగాలను మోహరించింది. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దించడానికి ప్రయత్నించవచ్చనే ఊహాగానాలు మరింత ముమ్మరమయ్యాయి. మదురో ఇప్పటికే అమెరికాలో నార్కో టెర్రరిజం ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

## వచ్చే వారం నుంచి తమిళనాడులో సర్






**చెన్నై అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తమిళనాడులో వచ్చే వారం నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రారంభమవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం మద్రాస్ హైకోర్ట్‌కు శుక్రవారం తెలిపింది. చెన్నైలోని టి.నగర్ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో భారీగా అవకతవకలు జరిగాయని మాజీ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యే సత్యనారాయణ వేసిన పిటిషన్‌పై స్పందిస్తూ ఈసీ ఈ విషయాన్ని వెల్లడించింది.పిటిషనర్ లేవనెత్తిన అంశాన్ని సర్‌లో పరిశీలిస్తామని కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో బీహార్‌లో సర్ నిర్వహణకు సంబంధించిన సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తమకు సమర్పించాలని హైకోర్ట్ ఈసీని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది.

## ఓలా, ఉబర్‌కు పోటీగా.. భారత్ ట్యాక్సీ




**న్యూఢిల్లీ: అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా సహకార (కో-ఆపరేటివ్) క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని (100%) డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చు.ఈ సేవలు డిసెంబర్ నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి. వచ్చే నెలలో 650 మంది డ్రైవర్లతో ఈ సేవలు ముందుగా ఢిల్లీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ నాటికి 5 వేల మంది డ్రైవర్లు, మహిళా సారథుల (డ్రైవర్లు)తో దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తారు. ఇది సభ్యత్వ ఆధారిత మోడల్.

## కశ్మీర్ రాజ్యసభ ఎన్నికలు..

**ఎన్సీ-3, బీజేపీ-1 కైవసం**



**శ్రీనగర్ అక్టోబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్ముకశ్మీరులో శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఘన విజయం సాధించింది. అధికరణ 370 తర్వాత మొదటిసారి ఈ ఎన్నికలు జరిగాయి.నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగగా మూడింటిలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అభ్యర్థులు చౌదరి మహమ్మద్ రంజాన్, సజాద్ కిచ్లూ, జీఎస్ (షమ్మీ) ఒబెరాయ్ గెలిచారు, మరో స్థానంలో ఎన్‌సీ అభ్యర్థి ఇమ్రాన్ నబీ దార్‌ను బీజేపీ అభ్యర్థి సత్‌పాల్ శర్మ ఓడించారు. 54 ఓట్లలో శర్మకు 32 ఓట్లు లభించడంతో విజేతగా నిలిచారు.




## ట్రెండీ డ్రెస్‌లో క్యూట్‌గా.. మహానటి అదిరిపోయింది

కీర్తి సురేష్ గురించి ఎంత చెప్పినా తక్కువే, అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ అమ్మడు నేను శైలజా సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అయ్యింది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు మంచి మార్కులు పడ్డాయి.దీంతో వరసగా అవకాశాలు తలుపు తట్టాయి. ముఖ్యంగా ఈ బ్యూటీ నేచురల్ స్టార్ నాని సరసన నేను లోకల్ మూవీలో నటించి, మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఈ సినిమా తర్వాత కీర్తికి వరసగా ఆఫర్స్ రావడంతో వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ వరస సినిమాలు, బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకొని స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది.దసరా మూవీతో పాన్ ఇండి క్రేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ, మహానటితో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఈ సినిమా తర్వాత ఈ అమ్మడు మంచి గుర్తింపు సంపాదించుకుంది.ఇక పెళ్లికి ముందు బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయిన ఈ బ్యూటీ ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేస్తుంది. అతి త్వరలో ఈ బ్యూటీ విజయ్ దేవరకొండ సరసన నటించే ఛాన్స్ కొట్టేసింది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా డ్రెండీ డ్రెస్‌లో తన అందంతో అందరీన ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.



## ఓటీటీలోకి మలయాళీ బ్లాక్ బస్టర్ 'కొత్త లోక'..

### స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!

చిన్న సినిమాగా విడుదలై మలయాళంలో బ్లాక్ బస్టర్ అందుకున్న 'లోక చాప్టర్ 1చంద్ర' (తెలుగులో కొత్త లోక) చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్ అక్టోబర్ 31 నుంచి మలయాళంతో పాటు, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఆగష్టు 28న విడుదలైన ఈ చిత్రం మలయాళంతో పాటు ప్రపంచవ్యాప్తంగా రికార్డు వసూళ్లను సాధించిన విషయం తెలిసిందే. మలయాళంలో ఆల్‌టైమ్ హిట్‌గా రికార్డు నెలకోల్పిన ఈ చిత్రం ఇండస్ట్రీలో మొట్టమొదటి సారిగా రూ. 300 కోట్లు దాటిన సినిమాగా చరిత్ర సృష్టించింది. కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం 40 రోజుల్లోనే రూ. 300 కోట్ల వసూళ్లను రాబట్టడం విశేషం. మరోవైపు కేవలం మలయాళంలోనే 50000 షోలు ప్రదర్శించిన తొలి సినిమాగా 'లోక' రికార్డు సృష్టించింది. కళ్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో నటించగా నస్లేన్ కథానాయకుడిగా నటించాడు. దుల్కర్ సల్మాన్ నిర్మాతగా వ్యవహారించాడు.



## కేక పెట్టించిన కుర్ర భామ..

### షాలిని పాండే ఫోటోలకు ఫిదా అవ్వాల్సిందే

షాలిని పాండే. అర్జున్ రెడ్డి సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ చిన్నది. సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో తెరకెక్కిన అర్జున్ రెడ్డి సినిమా సంచలన విజయాన్ని అందుకుంది. ఆతర్వాత కొన్ని ఆఫర్స్ అందుకుంది. కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించలేకపోయింది. ఈ అమ్మడు నటించిన సినిమాల్లో 118 సినిమా ఆ ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. మిగిలిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చేసే హడావిడి అంతా ఇంతా కాదు .తన అందాలతో కుర్రాళ్లకు గాలాలు వేస్తుంది. అందాలు ఆరబోస్తూ ఫోటోలకు ఫోజులిస్తుంది. అందం , అభినయం ఉన్న ఈ అమ్మడిని అవకాశాలు మాత్రం వరించడం లేదు. ఇక నెట్టింట ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు భారీ డిమాండ్ ఉంటుంది. నెటిజన్స్ ఈ బ్యూటీ ఫోటోల పై క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.షాలిని పాండే తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ బ్యూటీ 1993 సెప్టెంబర్ 23న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. జబల్‌పూర్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన షాలిని, చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చింది.ఇంజనీరింగ్ చదువుతున్న రెండవ సంవత్సరం నుంచే ఆమె నాటకాల్లో నటించడం ప్రారంభించింది. షాలిని పాండే 2017లో విజయ్ దేవరకొండ నటించిన తెలుగు చిత్రం అర్జున్ రెడ్డి ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె ప్రీతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.




## శ్రీలంకలో పెద్ది పాట షూటింగ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం పెద్ది కోసం శ్రీలంకకు బయల్దేరారు. 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని అంటుతు న్నాయి. సినిమా షూటింగ్ కోసం హీరో రామ్ చరణ్ మరియు డైరెక్టర్ బుచ్చి బాబు సానా శ్రీలంకకు బయల్దేరారు. సమాచారం ప్రకారం, రేపటి నుండే అక్కడ పెద్ది షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ శ్రీలంక షెడ్యూల్‌లో, టీమ్ పెద్ది కొన్ని కీలకమైన సన్నివేశాలను, ఒక పాటను చిత్రీకరించనుంది. శ్రీలంకలోని అద్భుతమైన లొకేషన్లలో హీరో చరణ్, హీరోయిన్ జాన్వీ కాంబినేషన్లో ఈ పాటను షూట్ చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేసింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా మ్యూజికల్ అప్‌డేట్ గురించి కూడా ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. శ్రీలంకలో ఈ షూటింగ్ షెడ్యూల్ చురుకుగా పూర్తి చేసిన వెంటనే, ఈ సినిమా నుండి మొదటి సింగిల్‌ను విడుదల చేయడానికి మేకర్స్ ఎలాన్ చేస్తున్నారు. విశేషమేమిటంటే, ఈ మొదటి సింగిల్ పాటలో శ్రీలంకలో చిత్రీకరించిన అద్భుతమైన విజువల్స్‌ను జత చేయనున్నారు. దీంతో, సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## ఓటిటిలోకి వచ్చేస్తున్న ఇడ్లికొట్టు

ధనుష్ , నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన వ్యక్తిత్వం కోసం ఉద్యోగాన్ని వదిలి.. తండ్రి వారసత్వంగా ఇడ్లీ కొట్టు నడిపే సాధారణ వ్యక్తి పాత్రలో ధనుష్ కనిపించారు. గ్రామిణ నేపథ్యంలో రూపొందడం, విజయవంతమైన 'తిరు' తర్వాత ధనుష్, నిత్యామేనన్ కలిసి నటించడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఆ స్థాయి వినోదాన్ని మాత్రం అందించలేకపోయింది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. అక్టోబరు 29వ తేదీ నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ పోస్టర్‌ను పంచుకుంది. శివ కేశవులు (రాజ్‌కిరణ్) ఇడ్లీ కొట్టు అంటే ఆ ఊళ్లో ఫేమస్. ఎంతో ఇష్టంగా, మనసు పెట్టి చేసే ఆ కొట్లో ఇడ్లీలు ఎంతో రుచికరం. శివ కేశవులు కొడుకే మురళి (ధనుష్). కొత్తతరం కుర్రాడు కదా, తన తండ్రి నడుపుతున్న కొట్టుని కాస్త ఫ్రాంచైజీలా మార్చేసి, అదే పేరుతో ఇతర చోట్ల కూడా హోటల్స్‌ని ఏర్పాటు చేసి డబ్బు సంపాదించాలని ఆశపడతాడు. కానీ, తన చేతులతో చేయని ఇడ్లీలను తన పేరుతో అమ్మడానికి ససేమిరా ఇష్టపడడు శివకేశవులు. దాంతో మురళి ఉన్నతమైన జీవితం అంటూ కన్నవాళ్లని, ఉన్న ఊరుని వదిలి పట్నం బాట పడతాడు. అలా మొదలైన అతని పరుగు బ్యాంకాక్‌కి చేరుతుంది. పనుల్లో పడి కన్నవాళ్లని కూడా పట్టించుకోడు. బ్యాంకాక్‌లోనే తన బిజినెస్‌లో పార్ట్‌నర్ అయిన విష్ణువర్ధన్ (సత్యరాజ్) కూతురు మీరా (షాలిని పాండే)తో పెళ్లి నిశ్చయమవుతుంది. మరికొన్ని రోజుల్లో పెళ్లి అనగా మురళి తండ్రి శివ కేశవులు చనిపోతాడు. తండ్రి చివరి చూపు కోసం వచ్చిన మురళి తిరిగి బ్యాంకాక్ వెళ్లాడా లేదా?శివకేశవులు చనిపోయాక ఆయన ఇడ్లీ కొట్టు ఏమైంది?మురళికీ, కల్యాణి (నిత్య మేనన్)కీ మధ్య సంబంధం ఏమిటి?మీరాతో అతని పెళ్లి జరిగిందా? అన్నది చిత్ర కథ.

